

పంట అమ్మకానికి పడిగాపులు

జన్నారం మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఎదురు చూడాల్సి వస్తోంది. వారం రోజులుగా ధాన్యం వద్ద పడిగాపులు కాస్తున్నారు. 9లో▸

ఇద్దరికి కరోనా

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో బుధవారం 11మంది కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఇద్దరికి పాజిటివ్ వచ్చినట్లు ఆస్పత్రి వర్గాలు ప్రకటించాయి. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహానికి చెందిన ఓ యువకుడు, తాండూర్ మండలం బోయపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ కరోనా బారిన పడ్డారు. వీరికి కరోనా కిట్స్ ఇచ్చి హోం క్వారంటైన్ పాటించాలని వైద్యులు సూచించి ఇంటికి పంపించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0 /24.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

మన బడి.. అసంపూర్తి..!

- ఏడాదైనా పూర్తికాని పనులు
- కొన్ని పాఠశాలల్లో ఇప్పటికీ ప్రారంభంకాని వైనం
- జూన్ 12 నాటికి పూర్తి చేయడం గగనమే
- వర్షాలు ప్రారంభమైతే పనులకు ఆటంకం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని ప్రారంభించింది. మొదటి విడతలో ఎంపిక చేసిన పాఠశాలల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించి ఏడాది కావస్తున్నా ఇప్పటికీ నత్తనడకన సాగుతున్నాయి. కొన్నిచోట్ల టెండర్ల ప్రక్రియ ఆలస్యం కావడంతో పనులు ప్రారంభించలేదు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికైనా పూర్తి చేస్తారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులపై జిల్లాలోని ఆయా పాఠశాలలను 'సాక్షి' విజిట్ చేసింది.

సాక్షి విజిట్



హాజీపూర్: ముల్కల్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనులు నిలిచిపోయిన భవనం

మంచిర్యాల నియోజకవర్గంలో...

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో మొదటి విడతలో తొమ్మిది పాఠశాలు ఎంపిక చేశారు. పైలట్ ప్రాజెక్టు కింద నిర్మాణం చేపట్టిన గర్మిళ్ల, రాజీవ్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలు అన్నిహంగులతో పూర్తి చేశారు. మిగతా ఏడు పాఠశాలల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయి.

- దండేపల్లి మండలంలో 19 పాఠశాలలు ఎంపిక చేశారు. సుమారు రూ.5 కోట్లు మంజూరు చేశారు. పెద్దంపేట, మామిడిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తికాగా మిగతా చోట్ల అసంపూర్తిగానే ఉన్నాయి. గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో ఇప్పటికీ పనులు మొదలు కాలేదు.
- లక్సెట్టిపేట మండలంలో ఆరు పాఠశాలు ఎంపిక చేశారు. చందారం, గుళ్లకోట జెడ్పీ హైస్కూళ్ల పనులు పూర్తికాగా ప్రారంభించారు. జెండా వెంకటాపూర్, పట్టణంలోని ఉర్దూమీడియం పాఠశాల, మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో 30 శాతం పనులు పూర్తయ్యాయి.
- హాజీపూర్ మండలంలో 5 పాఠశాలలు ఎంపిక చేశారు. పడ్తనపల్లి, నబ్బెపల్లి పాఠశాలల్లో పనులు పూర్తికాగా ప్రారంభమయ్యాయి. ముల్కల్ల యూపీఎస్, హైస్కూల్, దొనబండలో హైస్కూల్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి.
- జన్నారం మండలంలో మొదటి విడతలో 22 ప్రభుత్వ పాఠశాలలు ఎంపిక చేశారు. రూ.5.40కోట్లు మంజూరయ్యాయి. ఇందులో పొన్కల్, చింతలపల్లి పాఠశాలల్లో పనులు పూర్తికావడంతో ప్రారంభించారు. కలమడుగు, బాదంపల్లి, పొన్కల్ గ్రామాల్లో పెయింటింగ్ దశలో ఉన్నాయి. మిగతా 17 పాఠశాలల పనులు వివిధ దశల్లో ఉన్నాయి.



మందమర్రిరూరల్: అప్పర్ ప్రైమరీ స్కూల్



మంచిర్యాలఅర్బన్: బాలుర ఉన్నత పాఠశాలలో..



నస్పూర్ విలేజ్‌లో నిర్మాణ దశలో తరగతి గది

- నస్పూర్ మండలంలో 6 పాఠశాలలు ఎంపిక చేశారు. ఆర్కే6 కాలనీ, తీగల్‌పహాడ్ ప్రైమరీ స్కూళ్లలో పనులు పూర్తయ్యాయి. తీగల్‌పహాడ్ జెడ్పీహెచ్‌ఎస్, సీతారాంపల్లి ప్రైమరీ స్కూల్, విలేజ్ నస్పూర్ ప్రైమరీ స్కూళ్లలో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. తాళ్లపల్లి విలేజ్ శ్రీరాంపూర్ ఓసీ ప్రాజెక్టు ముంపు ప్రాంతం కావడంతో ప్రైమరీ స్కూల్‌లో ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు.

బెల్లంపల్లి నియోజకవర్గంలో...

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో 10 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేశారు. తొమ్మిదింటిలో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. రాంనగర్‌బస్తీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు స్థలం కేటాయించకపోవడంతో ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. నంబర్–2 ఇంక్‌లైన్ ప్రాథమిక పాఠశాలలో మాత్రమే పనులు పూర్తయ్యాయి. బెల్లంపల్లి బస్తీ, షంషీర్‌నగర్, అంబేద్కర్ ఉర్దూమీడియం, రడగంబాల బస్తీ పాఠశాలల్లో పనులు పూర్తయి పెయింటింగ్‌కు సిద్ధంగా ఉన్నాయి. మరో నాలుగు పాఠశాలల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయి.



బెల్లంపల్లి: కన్నెపల్లి హైస్కూల్‌లో డైనింగ్‌హాల్

- బెల్లంపల్లి మండలంలో 9 ప్రభుత్వ పాఠశాలలు ఎంపిక చేశారు. ఇప్పటివరకు ఏ ఒక్క పాఠశాలలో కూడా పనులు పూర్తికాలేదు.
- తాండూర్ మండలంలో 14 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి రూ.3.92 కోట్లు మంజూరు చేశారు. గోపాల్‌నగర్, రేచినీ మండల పరిషత్ పాఠశాలల్లో నిర్మాణాలు పూర్తయ్యాయి. అచ్చులాపూర్, బారేపల్లి, మాదారం, తాండూర్ ఉర్దూమీడియం పాఠశాలల్లో పనులు అసంపూర్తిగానే ఉన్నాయి.
- కాసిపేట మండలంలో 11 పాఠశాలలు ఎంపిక చేశారు. మూడు జిల్లా పరిషత్, 1 ఎంపీయూపీఎస్, 7 ఎంపీపీఎస్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన పల్లంగూడ, సోనాపూర్ ఎంపీపీఎస్‌లలో పనులు పూర్తిస్థాయిలో, మిగతా పాఠశాలల్లో 80 శాతం పనులు పూర్తయ్యాయి.
- నెన్నెల మండలంలో 11 పాఠశాలలను ఎంపిక చేశారు. కుశ్నపల్లి, గొల్లపల్లి పాఠశాలల్లో పనులు పూర్తికాగా భవనాలు ప్రారంభించారు. మిగతా 9 గ్రామాల్లోని పాఠశాలల్లో 70 శాతం పనులు పూర్తయ్యాయి.
- భీమిని మండలంలో 10, కన్నెపల్లి మండలంలో 11 పాఠశాలలను ఎంపిక చేశారు. భీమిని మండలంలోని చెన్నాపూర్, చిన్నగుడిపేట ఎంపీపీఎస్ పాఠశాలల్లో 90 శాతం, మిగతా పాఠశాలల్లో 50 శాతం పనులు పూర్తయ్యాయి. కేస్లాపూర్‌లో భూ సమస్యతో పనులు మొదలు కాలేదు. కన్నెపల్లి మండలంలో జజ్జరవెల్లి, చింతపుడి, ఎంపీపీఎస్ పాఠశాలలో 90 శాతం, మిగతా పాఠశాలల్లో 50 శాతం పనులు పూర్తయ్యాయి.

చెన్నూర్ నియోజకవర్గంలో...

చెన్నూర్: పట్టణంలోని ఎనిమిది పాఠశాలలను ఎంపిక చేసి నిధులు విడుదల చేశారు. ఇప్పటి వరకు పద్మనగర్‌లోని ప్రాథమిక పాఠశాల మినహా మిగతా 7 పాఠశాలల్లో పనులు అసంపూర్తిగానే ఉన్నాయి.

- చెన్నూర్ మండలంలో 15 ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఎంపికయ్యాయి. సుద్దాలలోని ప్రాథమిక పాఠశాలలో పనులు తుదిదశకు చేరుకోగా 14 పాఠశాలల్లో అసంపూర్తిగానే ఉన్నాయి.
- కోటపల్లి మండలంలో మొదటి విడత 16 పాఠశాలలను ఎంపిక చేసి రూ.45 కోట్లు మంజూరు చేశారు. మల్లంపేట, శంకరాపూర్ పాఠశాల పనులు మాత్రమే పూర్తికాగా మిగతా పాఠశాలల్లో పనులు అసంపూర్తిగానే ఉన్నాయి.
- మందమర్రి మండలంలో 14 పాఠశాలలు ఎంపిక చేశారు. రూ.3.85 కోట్లు మంజూరయ్యాయి. పట్టణంలోని ఫిల్టర్ బెడ్ ఏరియాలోని మండల పరిషత్ ప్రైమరీ స్కూల్, దీపక్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పనులు పూర్తయ్యాయి. 12 బడుల్లో నిర్మాణాలు కొనసాగుతున్నాయని ఎంఈవో జాడి పోచయ్య తెలిపారు.
- భీమారం మండలంలో 8 పాఠశాలలను ఎంపిక చేసి రూ.కోటి 60 లక్షలు మంజూరు చేశారు. భీమారం జిల్లా పరిషత్ హైస్కూల్, పోలంపల్లి, కాజిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ నిర్మాణం, వాష్ బేషన్ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. కొత్తపల్లి, అంకుషాపూర్, కొత్తగూడెం ప్రాథమిక పాఠశాలల, బూరుగుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల పనులు పూర్తయ్యాయి.



చెన్నూర్: అసంపూర్తిగా చెన్నూర్ ప్రాథమిక పాఠశాల భవనం



కోటపల్లి: రొయ్యపల్లిలో కొనసాగుతున్న పనులు



చెన్నూర్‌రూరల్: ఎల్లక్కపేట ప్రాథమిక పాఠశాల ఇలా..



మందమర్రిరూరల్: నిర్మాణంలో ఉన్న రెండోజోన్‌లోని అప్పర్ ప్రైమరీ స్కూల్

న్యూస్‌రీల్

పారదర్శకంగా ఓటరు జాబితా



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి సంయుక్త ఎన్నికల అధికారి రవికిరణ్‌తో కలిసి ఓటరు గుర్తింపు కార్డుల జారీ, జాబితా రూపకల్పనపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ ప్రతీ జిల్లా నుంచి నోడల్ అధికారిని నియమించాలని, ఎన్నికల నిర్వహణ కోసం ఉద్యోగులు, సిబ్బందికి శిక్షణ అందించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయి శిక్షకుల నియామక ప్ర తిపాదనలు అందించాలని తెలిపారు. తొలగించిన ఓట్ల వివరాలు మరోసారి పరిశీలించాలని అన్నారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో 17,687 మంది ఓటర్ల వివరాలు జాబితా నుంచి తొలగించామని, మరోసారి పరిశీలిస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ తన చాంబర్‌లో ఓటరు జాబితా రూపకల్పన, సవరణలు, తొలగింపులపై అధికారులతో సమీక్షించారు. మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు వేణు, శ్యామలాదేవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శ్రీరాములు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు

మంచిర్యాలటౌన్: దివ్యాంగులు ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య తెలిపారు. వచ్చే నెల 5వరకు ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. శారీరక వైకల్యం, బధిరులు, అంధులు, మానసిక దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు ఉచితంగా పంపిణీ చేస్తామని, https:// tsobmms.cgg.gov.inలో దరఖాస్తుకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. రెట్రోఫిట్టెడ్ మోటరైజ్డ్ వెహికిల్స్ 10, బ్యాటరీ వీల్‌చైర్లు 8, ల్యాప్‌టాప్‌లు 5, మూడు చక్రాల రిక్షాలు 19, సాధారణ వీల్‌చైర్‌లు 3, చంక కర్రలు 37, చేతికర్రలు 15, డైసీ ప్లేయర్లు 1, బధిరులకు శ్రవణ యంత్రాలు(హియరింగ్ ఎయిడ్స్) 13, స్మార్ట్ కేన్స్ 3, స్మార్ట్‌ఫోన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు.

నిరుద్యోగులకు టోకరా !

- మూడు నెలల కోచింగ్‌లో నెలన్నరే క్లాస్‌లు
- సిలబస్ పూర్తి చేయని ప్రైవేటు శిక్షణ సంస్థ
- మంచిర్యాలలోని సంస్థ డైరెక్టర్‌పై అభ్యర్థుల ఫిర్యాదు
- ఫీజు తిరిగి ఇస్తానని పోలీసుస్టేషన్‌లో అంగీకారం



బుధవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన నిరుద్యోగులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: నిరుద్యోగుల బలహీనతను ఆసరా చేసుకుని కొన్ని ప్రైవేటు కోచింగ్ సెంటర్లు టోకరా వేస్తున్నాయి. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ ప్రాంతాలకు వెళ్లి శిక్షణ పొందలేక కొందరు స్థానికంగానే పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకుంటున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ సంస్థ నిపుణులైన బోధకులతో శిక్షణ ఇప్పిస్తామని చెప్పి మధ్యలోనే చేతులెత్తేయడంతో అభ్యర్థులు పోలీసులను ఆశ్రయించారు. పరీక్షలు సమీపిస్తున్న వేళ చదువుకోవాల్సి ఉండగా తరగతులే పూర్తి కాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలలోని ఓ ప్రైవేటు కోచింగ్ సెంటర్‌లో గ్రూప్–2, 4 శిక్షణ కోసం చేరి ఫీజులు చెల్లించారు. ముందుగా చెప్పిన ప్రకారం తరగతులు, సిలబస్ పూర్తి చేయలేదు. సిలబస్ పూర్తి చేయాలని అభ్యర్థులు కోరినా పట్టించుకోకపోవడంతో మంచిర్యాల పోలీసుస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. గతంలోనూ ఓసారి ఫిర్యాదు చేయగా.. మాట్లాడుకుందాం రమ్మని పిలిచిన సంస్థ డైరెక్టర్.. తన పై ఫిర్యాదు చేస్తారా అంటూ బెదిరించారని, క్లాసులపై అడిగిన మహిళా అభ్యర్థుల పట్ల అనుచితంగా మాట్లాడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పూర్తి కాని సిలబస్

మూడు నెలలు కోచింగ్ ఉంటుందని చెబితే అభ్యర్థులు నమ్మారు. నిపుణులతో కోచింగ్ ఇప్పిస్తామని ప్రారంభంలో ప్రచారం చేశారు. దీంతో అభ్యర్థులు ఆసక్తి చూపారు. గత డిసెంబర్‌లో శిక్షణ ప్రారంభం కాగా, కొందరికి సిలబస్ పూర్తి చేశారు. ఫిబ్రవరిలో చేరిన వారికి మాత్రం పూర్తి చేయలేదు. ఫీజు మాత్రం ఒక్కో అభ్యర్థి నుంచి రూ.12వేలు, మరో రూ.వెయ్యి అడ్మిషన్‌తో మొత్తం రూ.13వేలు తీసుకున్నారు. కొందరు రెండేసి వాయిదాల్లో చెల్లించారు. ఫీజు వసూలు చేసిన నిర్వాహకులు తరగతులు చెప్పడంలో శ్రద్ధ చూపలేదు. 38క్లాస్‌ల వరకు నెలన్నర రోజులు చెప్పి మధ్యలో సెలవులు ఇచ్చి చదువుకోమ్మని చెప్పారని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చివరకు కోచింగ్ సెంటర్ డైరెక్టర్‌పై ఫిర్యాదు చేశారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన సంస్థ డైరెక్టర్, అభ్యర్థులు కట్టిన ఫీజులో కొంత మేర తిరిగి చెల్లిస్తానని ఒప్పుకున్నట్లు తెలిసింది. దీనిపై సంస్థ డైరెక్టర్ నిహార్ వర్మను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

అనుమతి లేని కోచింగ్ సెంటర్లు

మంచిర్యాల జిల్లా కేంద్రంలో కొందరు అనుమతులు లేకుండానే పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నారు. చాలామంది నిరుద్యోగులు నమ్మి చేరుతున్నారు. గతంలో ఓ కోచింగ్ సెంటర్ సైతం డబ్బులు వసూలు చేసి మధ్యలోనే శిక్షణ నిలిపివేసింది. అద్దె గదుల్లో, అరకొర వసతులతో నిరుద్యోగులు క్లాస్‌లు వింటున్నారు. ఇలాంటి వాటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు కోరుతున్నారు.

రూ.12వేలు ఫీజు చెల్లించాను



రెండు వాయిదాల్లో కోచింగ్ ఫీజు రూ.12వేలు కట్టాను. మూ డు నెలలు శిక్షణ అని చెప్పి నెల రోజులే క్లాస్‌లు చెప్పారు. మధ్యలో సెలవులు ఇచ్చారు. ఆ తర్వాత క్లాస్‌లు చెప్పండి అని అడిగితే మమ్మల్నే బెదిరిస్తున్నారు. దీంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాం.

– గుర్రం చంద్రశేఖర్, నిరుద్యోగి, మంచిర్యాల

మెరుగైన సేవలందించాలి

కోటపల్లి: ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు ఆదేశించారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని, రోగుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. గర్భిణుల పథకాలు, సేవలపై అవగాహన కల్పించి సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని సూచించారు. ఎండదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐడీఎస్‌పీ డాక్టర్ ఫయాజ్, మెడికల్ ఆఫీసర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేయొద్దు

వేమనపల్లి: పీహెచ్‌సీ సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని డీఎంహెచ్‌ఓ సుబ్బారాయుడు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. న్యూట్రిషన్ కిట్, స్టోర్ రూమ్, రికార్డు రూమ్‌లను పరిశీలించారు. ప్రోగ్రాం ఆఫీసర్ ఫయాజ్‌ఖాన్, పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్, హెల్త్ సూపర్‌వైజర్ సరోజ, హెల్త్ అసిస్టెంట్ లింగయ్య, శన్ముకచారి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో జోష్



నిరుద్యోగ నిరసన ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

- నిరుద్యోగ నిరసన ర్యాలీ సక్సెస్
- రేవంత్‌రెడ్డికి జన నీరాజనం
- పాదయాత్రలో అభివాదం చేస్తూ ముందుకు
- కార్నర్ మీటింగ్‌కు తరలివచ్చిన శ్రేణులు



రేవంత్‌రెడ్డికి నాగలి బహూకరిస్తున్న నాయకులు

సాక్షి, ఆదిలాబాద్/ఆదిలాబాద్‌టౌన్/కైలాస్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన నిరుద్యోగ నిరసన సమరభేరి సక్సెస్ కావడంతో ఆ పార్టీలో జోష్ కనిపిస్తోంది. ర్యాలీలో భాగంగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పాదయాత్రకు జనం నుంచి స్పందన కనిపించింది. అంబేద్కర్ చౌక్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్ ప్రాంతం జనంతో కిక్కిరిసి పోయింది. సాయంత్రం 6 గంటల సమయంలో ఆదిలాబాద్‌కు చేరుకున్న రేవంత్‌కు మావల వద్ద ఘన స్వాగతం పలికారు. కలెక్టరేట్ చౌక్ నుంచి పాదయాత్ర నిర్వహించారు.

ఆదిలాబాద్‌ను దత్తత తీసుకుంటాం..

కొత్త ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తామని రేవంత్‌రెడ్డి అన్నారు. కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్‌కు వస్తుంటే ఓ మిత్రుడు అక్కడ సభ ఎలా జరుగుతుందోనని అన్నాడని, ఇటీవల ఒక్కడు పార్టీని వీడడంతో ఆయన అలా అన్నారని చెప్పారు. అయితే పోయినోడు వెంట్రుకతో సమానమంటూ పరోక్షంగా ఇటీవల పార్టీని వీడిన మహేశ్వర్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వేలాది మంది కాంగ్రెస్ సైన్యం ముందు ఒక్కడు పార్టీని వీడడం లెక్క కాదని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో లక్షా 60వేల ఎకరాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆదిలాబాద్ అధైర్యపడొద్దని అన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే జోకుడు రామన్న అంటూ జోగు రామన్నను విమర్శించారు. కేసీఆర్‌ను జోకడమే ఆయన చర్య అని విమర్శించారు. తనయుడికి మున్సిపల్ చైర్మన్ పదవి కట్టబెట్టడం ద్వారా కుటుంబ రాజకీయాలకు పెద్దపీట వేస్తున్నారని విమర్శించారు.

సుజాత వర్గం నారాజ్..

కార్నర్ మీటింగ్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత రేవంత్‌రెడ్డి పక్కనే నిలుచున్నారు. ఆయన ప్రసంగిస్తూ సుజాత పేరును ప్రస్తావించకపోవడంతో ఆమె అభిమానులు ఈ విషయంలో అరవగా, రేవంత్‌రెడ్డి వారిని హెచ్చరించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సుజాత వర్గం ఈ విషయంలో నారాజ్ అయింది. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు దూరంగా ఉన్నారు. ప్రధానంగా ఆయన వర్గంగా కొనసాగుతున్న వారిని రేవంత్ రెడ్డి పట్టించుకోలేదనే వాదనలు పార్టీలో వినిపిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి నదీం జావీద్, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, మాజీ మంత్రులు షబ్బీర్ అలీ, సుదర్శన్‌రెడ్డి, చిలుక్కూరి రాంచంద్రారెడ్డి, మాజీ ఎంపీలు మల్లు రవి, సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, పీసీసీ డెలిగెట్ శేఖర్ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకట్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

'ఓపెన్' పరీక్షలకు 220 మంది గైర్హాజర్

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో బుధవారం నిర్వహించిన ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు 220 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పదో తరగతిలో 648 విద్యార్థులకు గానూ 582 మంది, ఇంటర్‌లో 1,125 మందికి గానూ 1,071 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను రాష్ట్ర పరిశీలకుడు రాజీవ్ పరిశీలించినట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

కానిస్టేబుల్ పరీక్షకు ప్రత్యేక బస్సులు

మంచిర్యాలఅర్బన్: పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా ఈ నెల 30న నిర్వహించనున్న కానిస్టేబుల్ ఉద్యోగ పరీక్షకు మంచిర్యాల డిపో నుంచి ఆదిలాబాద్‌కు ఆర్టీసీ రెండు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. ఇందుకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. ఉదయం 4, 4.30 గంటలకు మంచిర్యాల డిపో నుంచి ఆదిలాబాద్‌కు బస్సులు బయలుదేరి వెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి



మృతి చెందిన బాదిరావు

కెరమెరి(ఆసిఫాబాద్): విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన సిర్పూర్(యు) మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాఘాపూర్ గ్రామానికి చెందిన కోవ బాదిరావు(46) బుధవారం ఉదయం పొలం వద్దకు బయలుదేరాడు. బాదిరావు పొలంలోంచి కర్నుగూడకు విద్యుత్ లైను వేశారు. మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి విద్యుత్ వైరు తెగి పొలం చుట్టూ వేసిన ఫెన్సింగ్‌పై పడింది. విద్యుత్ వైరును గమనించని బాదిరావు ఫెన్సింగ్ దాటి చేను లోపలికి వెళ్లామని వైరును పట్టుకోవడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మోతబాయి, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

'సీఈఐఆర్' ను సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంపల్లి: మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నవారు సీఈఐఆర్ అప్లికేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య సూచించారు. బుధవారం తన ఛాంబర్‌లో బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామానికి చెందిన దుర్గం బాలరాజ్ పోగొట్టుకున్న ఫోన్‌ను సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా రికవరీ చేసి అప్పగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సెల్‌ఫోన్ అపహరణకు గురైన బాధితుడి ఆధార్‌కార్డు, సంబంధిత సెల్‌ఫోన్ ఐఎంఈఐ నంబర్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా www. ceir. gov. in వెబ్‌సైట్ లోకి లాగిన్ అయితే తిరిగి ఫోన్ పొందే వీలుందన్నారు. బెల్లంపల్లి రూరల్ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, తాళ్లగురిజాల ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

మిస్సింగ్ మిస్టరీ...?

- రామగుండం కమిషనరేట్ పరిధిలో ఏటా పెరుగుతున్న కేసులు
- గుర్తు తెలియని మృతదేహాలపై అనుమానాలు
- ఆన్‌లైన్‌లో పెట్టి మమ అనిపిస్తున్న పోలీసులు
- బాధిత కుటుంబాల్లో తీరని ఆవేదన

రామగుండం కమిషనరేట్ పరిధిలో మిస్సింగ్ కేసుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వారి ఆచూకీ నెలల తరబడిగా లభించకపోవడంతో బాధిత కుటుంబాల్లో ఆందోళన నెలకొంటోంది. అసలు బతికే ఉన్నారా? లేదా మరే ప్రమాదంలోనైనా చిక్కుకున్నారా? ఎక్కడైనా బానిస బతుకులు బతుకుతున్నారా? అంతుచిక్కడం లేదు. తప్పిపోయిన వారి ఆచూకీ కనుగొనడం పోలీసులకు పెను సవాల్‌గా మారుతోంది. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా అదృశ్యమైన కేసులపై పోలీసులు పూర్తిస్థాయిలో దృష్టి సారించడం లేదన్న ఆరోపణలున్నాయి.

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2020 నుంచి 2023 మార్చి వరకు 1,798 మిస్సింగ్ కేసులు నమోదయ్యాయి. మూడేళ్లలో 1,917 మంది అదృశ్యం కాగా వీరిలో 1,242 మంది మహిళలు, 75 మంది బాలికలు ఉన్నారు. వారిలో 1,790 మంది ఆచూకీ లభించింది. ఇంకా 127 మంది జాడ తెలియకపోవడంతో బాధిత కుటుంబాలు తీరని క్షోభ అనుభవిస్తున్నాయి. అదృశ్యమైన వారిలో చిన్నారుల నుంచి యువత, మధ్య వయస్సు వారు, మహిళలు సైతం ఉండడంపై సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. 18 ఏళ్లలోపు బాలబాలికలు అక్రమ రవాణాకు గురవుతున్నారన్న ఆరోపణలున్నాయి. కారణమేదైనా సరే కమిషనరేట్ పరిధిలో మిస్సింగ్ కేసులు పెరగడం కలకలం రేపుతోంది.

కుటుంబ, ఆర్థిక సమస్యలతో...

తెలిసీ తెలియని వయస్సులో కొందరు, శారీరక వ్యామోహంలో మరికొందరు, ప్రేమ ముసుగులో పడి ఇంకొందరు ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోతున్నారు. అలా అదృశ్యమైన వారిలో యువత చాలామట్టుకు కొన్ని నెలల తర్వాత పోలీస్ స్టేషన్‌కు వచ్చి వివాహం చేసుకుని జంటలుగా తిరిగివెళ్తున్నారు. మరి కొందరి ఆచూకీ లభించడం లేదు. మహిళలైతే అక్రమ రవాణాకు గురై ఎక్కడైన వ్యభిచారం కూపంలో చిక్కుకుపోయారా..? లేక హత్యకు గురయ్యారా? అనేది అంతుచిక్కడం లేదు. అక్కడక్కడా గుర్తు తెలియని మృతదేహాలు లభ్యమవుతుండగా వాటి వద్ద ఎలాంటి ఆధారాలు లభించడం లేదు. రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలపై అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. వాటిపై రైల్వే అధికారులు సమగ్ర విచారణ లేకుండానే కేసులు మూసివేస్తున్నారు. అదృశ్యమైన కేసుల్లో ఎక్కువగా కుటుంబ సమస్యలు, ఆర్థిక సమస్యలు, వివాహేతర సంబంధాలతోనే కొందరు మహిళలు, పురుషులు గడపదాటుతున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. కొందరైతే కన్న బిడ్డలను సైతం వెంట తీసుకెళ్తున్నారు. ఉమ్మడి కుటుంబాలు లేకపోవడంతో భార్యభర్తల మధ్య సయోధ్య కుదిర్చే అవకాశం లేకుండా పోతోంది. అంతేకాకుండా సామాజిక మాధ్యమాల్లో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకున్న మహిళలు కట్టుకున్న వారిని దూరం చేసుకున్న ఘటనలు ఉన్నాయి. ఇలాంటి ఘటనలు మిస్టరీగా ఉండడం గమనార్హం.



మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో నోటీస్ బోర్డుపై తప్పిపోయిన వారి వివరాలు

రామగుండం కమిషనరేట్‌లో మిస్సింగ్ కేసుల వివరాలు

సంవత్సరం	నమోదైన కేసులు	అదృశ్యమైన వారు	ఆచూకీ లభించినవారు	ఆచూకీ లభించనివారు
2020	423	436	416	20
2021	553	595	572	23
2022	670	717	676	41
2023(మార్చి)	152	169	126	43

మచ్చుకు కొన్ని ఘటనలు

- మంచిర్యాల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ఓ యువతిని కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతుండగా ఆమెకు బంధువైన ఓ యువకుడికి తెలిసిన వారి ఇంట్లో పనిచేసేందుకు 2014లో హైదరాబాద్ తీసుకెళ్లాడు. అప్పటి నుంచి ఇద్దరూ కనిపించకుండా పోయారు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇప్పటికీ వారి ఆచూకీ లభించలేదు.
- 2018 అక్టోబర్ 14న జిల్లా కేంద్రంలోని గోదావరి రైల్వే బ్రిడ్జి కింద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందిన. ఎవరో హత్య చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. హత్యకు గురైంది ఎవరు? ఏ ప్రాంతానికి చెందిన వాడు? ఎవరు హత్యచేసి ఉంటారు? అనేది ఇప్పటికీ మిస్టరీగానే మిగిలింది.

ప్రత్యేక దృష్టి సారించాం



మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాం. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లకు ఆన్‌లైన్ ద్వారా సమాచారం అందించాం. కమిషనరేట్ పరిధిలో చాలా కేసులు ఛేదించాం. కొన్ని కేసులే పెండింగ్‌లో ఉన్నాయి. మిస్సింగ్ కేసుల్లో పురోగతి సాధించేందుకు తల్లిదండ్రులు సహకరించాలి. ప్రేమ పేరుతో, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో వెళ్లిపోయిన వారే అధికంగా ఉన్నారు. మానవ అక్రమ రవాణపై దృష్టి సారించాం. ఎక్కడైనా అనుమానాస్పదంగా వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలి.

– రెమా రాజేశ్వరి, రామగుండం పోలీస్ కమిషనర్

గూడెం ఎత్తిపోతలకు మహర్దశ

- జీఆర్‌పీ పైప్‌లైన్ తొలగింపు
- ఎమ్మెస్ పైపులతో నిర్మాణం



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

దండేపల్లి(మంచిర్యాల): మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని గూడెం గోదావరి నది ఒడ్డున నిర్మించిన శ్రీ సత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకానికి మహర్దశ పట్టనుంది. తరచూ ఏర్పడుతున్న పైప్‌లైన్ లీకేజీ సమస్యకు పరిష్కారం లభించనుంది. సుమారు 3.11 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన జీఆర్‌పీ పైప్‌లైన్ తొలగించి దానిస్థానంలో ఎమ్మెస్(మైల్డ్ స్టీల్)పైప్‌లైన్ వేస్తున్నారు. 2009లో దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో మంజూరైన గూడెం ఎత్తిపోతల పథకాన్ని 2015లో సీఎం కేసీఆర్ పనులు పూర్తిచేయించి ప్రారంభించారు. ఎత్తిపోతల పథకం పంప్‌హౌజ్ నుంచి మండలంలోని తానిమడుగు వరకు 11 కిలోమీటర్లు ఉన్న జీఆర్‌పీ పైప్‌లైన్‌కు ఏటా నీటి విడుదల సమయంలో ఎక్కడో ఓచోట లీకేజీ ఏర్పడి నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దీంతో సాగునీరు అందక రైతులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి హరీష్‌రావు, ఇరిగేషన్ అధికారులు ఎత్తిపోతల పథకం నిర్మించిన మెగా కంపెనీ వారితో మాట్లాడారు. పథకం నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసిన పైప్‌లైన్ మార్చాలని సూచించారు. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం ఎత్తిపోతల పథకం వద్ద నిరుపయోగంగా ఉన్న పైప్‌లైన్‌ను తొలగించి దానికి సంబంధించిన ఎమ్మెస్ పైపులను గూడెం ఎత్తిపోతల పథకానికి తరలించారు. ఎత్తిపోతల పథకం పంప్‌హౌజ్ నుంచి సుమారు నాలుగు కిలో మీటర్ల దూరంలోనే ఎక్కువ లీకేజీలు ఏర్పడుతుండడంతో మొదట అక్కడే ఎమ్మెస్ పైపులు వేయనున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

పైప్‌లైన్ తొలగింపు పనులు పరిశీలన

ఎత్తిపోతల పథకం జీఆర్‌పీ పైప్‌లైన్ తొలగించి దాని స్థానంలో కొత్తగా వేస్తున్న ఎమ్మెస్ పైప్‌లైన్ నిర్మాణం పనులను ఎమ్మెల్యే దివాకర్‌రావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ నిర్మాణం గురించి వివిధ పార్టీల నాయకులు వివిధ రకాలుగా మాట్లాడినా నేను పట్టించుకోలేదన్నారు. పైప్‌లైన్ మార్చాలని సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావుతో మాట్లాడానన్నారు. పైప్‌లైన్ నిర్మాణం పనులను దగ్గరుండి పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.

ఓసీపీని సందర్శించిన డైరెక్టర్



ఓసీపీని పరిశీలిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్టు గనిని సింగరేణి డైరెక్టర్(పీపీ) జీ.వెంకటేశ్వర్‌రెడ్డి సందర్శించారు. బుధవారం ఆయన ఏరియా జీఎం సంజీవరెడ్డితో కలిసి క్వారీ వ్యూపాయింట్ నుంచి ఓసీపీని పరిశీలించారు. అక్కడి నుంచే ఓసీపీ అధికారులతో పని స్థలాలు, బొగ్గు ఉత్పత్తిపై చర్చించారు. ఓసీపీ పీఓ పురుషోత్తంరెడ్డి, ప్రాజెక్టు ఇంజనీర్ శ్రీనివాస్, అధికారులు చంద్రశేఖర్, సంపత్, మురళీమోహన్ పాల్గొన్నారు.

భూగర్భగనుల్లో నష్టాలు తగ్గించాలి

శ్రీరాంపూర్: భూగర్భ గనుల్లో వచ్చే ఉత్పత్తి నష్టాన్ని తగ్గించాలని సింగరేణి డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం సీసీసీలోని సింగరేణి గెస్ట్‌హౌజ్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏరియా అధికారులతో బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనపై రివ్యూ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తి ఖర్చు అధికంగా వస్తుందని, దీన్ని తగ్గించుకుంటేనే సంస్థకు భవిష్యత్ అన్నారు. ఓసీపీలో యంత్రాల పనిగంటలు మరింత పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ రమేశ్‌బాబు, శ్రీరాంపూర్ ఓసీపీ ప్రాజెక్టు అధికారి పురుషోత్తంరెడ్డి, ఏజెంట్లు గోపాల్‌సింగ్, ఏవీ రెడ్డి పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు బొగ్గు రవాణా చేపట్టాలి

జైపూర్(చెన్నూర్): నిర్దేశించిన లక్ష్యం మేరకు బొగ్గు రవాణా చేపట్టాలని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) జి.వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. జైపూర్ మండలం ఇందారం ఓపెన్‌కాస్టు ప్రాజెక్టును బుధవారం శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డితో కలిసి సందర్శించారు. ఆయన వెంట గని మేనేజర్ రవికుమార్, ఆపరేషన్స్ మేనేజర్ బ్రహ్మాజీరావు, ప్రాజెక్టు ఇంజనీర్ రమేశ్, సీనియర్ సెక్యూరిటీ అధికారి మురళీమోహన్ ఉన్నారు.

సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఓదెలు

రెబ్బెన(ఆసిఫాబాద్): గతేడాది సెప్టెంబర్‌లో చేపట్టిన సమ్మె సందర్భంగా జేఏసీ, సింగరేణి యాజమాన్యం మధ్య జరిగిన ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి అంబాల ఓదెలు డిమాండ్ చేశారు. బుధవారం గోలేటిలోని నర్సరీ వద్ద సీఎంపీఎఫ్ ధర్నా కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీ కార్మికులకు సీఎంపీఎఫ్‌ను వెంటనే అమలు చేసి జీవో ప్రకారం కనీస వేతనాలను అందించాలన్నారు. ఈ నెల 28న గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న మహాధర్నా విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్దెంకి సత్తయ్య, కార్మికులు చిన్నుబాయి, శారద, అర్చన, అనిత, లక్ష్మి, దుర్గం లక్ష్మి పాల్గొన్నారు.

హత్య కేసులో విచారణ ముమ్మరం

జైపూర్: మండలంలోని ఇందారం గ్రామంలో మంగళవారం జరిగిన యువకుడి హత్య కేసులో పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. యువతిని వేధింపులకు గురి చేస్తున్నాడని అందరూ చూస్తుండగానే ఆమె కుటుంబ సభ్యులు గ్రామానికి చెందిన ముస్కే మహేశ్‌పై కత్తి, రాళ్లతో దాడి చేసి దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. నలుగురు వ్యక్తులు కలిసి కత్తి, బండరాళ్లతో చంపడం, మానవత్వం మరిచిన స్థానికులు అడ్డుపడకపోవడం, వీడియో చిత్రీకరించడం జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా వైరలైంది. మృతుడు మహేశ్ తల్లి ఫిర్యాదు మేరకు యువతితోపాటు తల్లిదండ్రులు, మరో ఇద్దరు కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగిస్తున్నారు. వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు హత్యకు గల కారణాలు, పథకం ప్రకారమే హత్య చేశారా అనే కోణాలు విచారణ చేస్తున్నారు. ఒకటి రెండ్రోజుల్లోనే నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించేందుకు పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసినట్లు సమాచారం. కాగా, గతంలో మహేశ్, ఆ యువతి మాట్లాడుకున్న వీడియో కాల్స్ రికార్డింగ్ బుధవారం మరోసారి సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

కరీంనగర్ ఎంసీహెచ్‌లో శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమేనని బంధువుల ఆందోళన



మృతి చెందిన శిశువు



రాస్తారోకో చేస్తున్న శిశువు బంధువులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో సరైన చికిత్స అందక మూడు రోజుల శిశువు మృతి చెందింది. విధుల్లో ఉండాల్సిన పిల్లల వైద్యుడు ఆస్పత్రికి రాకపోవడమే కారణమంటూ బంధువులు బుధవారం ఆందోళనకు దిగారు. శిశువు తండ్రి మారుపాక విష్ణు తెలిపిన వివరాల ప్రకారం.. తన భార్య హర్షిణి రెండో కాన్పు కోసం తన స్వగ్రామం మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట నుంచి ఎంసీహెచ్‌కు తీసుకురావడంతో ఈ నెల 24న సిజేరియన్ ద్వారా కాన్పు చేశారన్నారు. ఆడ శిశువు జన్మించిందని, తల్లీబిడ్డా క్షేమంగానే ఉన్నారని వైద్యులు తెలిపారన్నారు. మంగళవారం రాత్రి శిశువు శరీరం వేడిగా అనిపించడంతో ఎస్ఎన్‌సీయూకి తీసుకెళ్లగా వైద్యులెవరూ విధుల్లో లేకపోవడంతో నర్సు సిరప్ వేసింది. అయినప్పటికీ జ్వరం తగ్గలేదు. బుధవారం ఉదయం 8 గంటలకు శిశువు శరీరం రంగులో తేడా, పొట్ట టైట్‌గా మారడంతో ఎస్ఎన్‌సీయూకు తీసుకెళ్లగా అప్పటికీ డాక్టర్ రాలేదు. దీంతో మళ్లీ నర్సు చూసి పొట్టలో సమస్య ఏమీ లేదని.. శిశువును భుజంపై ఎత్తుకుని తీసుకెళ్లమని చెప్పారు. ఉదయం 10 గంటల సమయంలో శిశువు కళ్లు తేలేస్తుండడంతో మరోసారి తీసుకెళ్లగా, చనిపోయిందని చెబుతూనే ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లమని ఉచిత సలహా ఇచ్చారు. దీంతో ఆగ్రహానికి గురైన బంధువులు ఆసుపత్రి ఎదుట రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి రాస్తారోకో విరమింపజేశారు. ఇదే విషయమై పిడియాట్రిక్ హెచ్‌వోడీ డాక్టర్ అజయ్‌కుమార్‌ను వివరణ కోరగా తల్లికి కోవిడ్ పాజిటివ్ ఉండడం వల్ల బిడ్డకు కూడా సంక్రమించిందని, ఊపిరితిత్తులకు ఇన్‌ఫెక్షన్ సోకి మృతి చెందే అవకాశం ఉందన్నారు.

ఎస్టీపీపీ అన్నిరంగాల్లో ముందంజ

జైపూర్(చెన్నూర్): సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు విద్యుత్ ఉత్పత్తితో పాటు కార్మికుల సంక్షేమంలో కూడా ముందంజలో ఉందని సంస్థ డైరెక్టర్ డి.సత్యనారాయణరావు అన్నారు. ఎస్టీపీపీలో నూతనంగా నిర్మించిన స్విమ్మింగ్‌పూల్, బీటీజీ స్టోర్స్, సింగరేణి పవర్ ట్రైనింగ్ శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఎస్టీపీపీ సీటీసీ సంజయ్‌కుమార్ సూర్, జీఎం డీవీఎస్ఎస్ సూర్యనారాయణరాజు, వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎంలు సుధాకర్, శ్రీనివాసులు, డీజీఎంలు రవికుమార్, ఎంఎన్‌వీ.రమణ, పర్సనల్ డీజీఎం కేసా నారాయణరావు, టీబీజీకేఎస్ నాయకులు చుక్కల శ్రీనివాస్, సీఎంవోఏఐ నాయకులు ఎంవీవీ వేణుగోపాల్, ఎన్‌వోటూ సీటీసీ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

స్థానికంగా క్వార్టర్లు కేటాయించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి స్థానికంగానే క్వార్టర్లు కేటాయించాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. బుధవారం జీఎం దేవేందర్, డెప్యూటీ సూపరింటెంట్ శౌరీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లిలోనే క్వార్టర్లను అలాట్ చేసేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు, సెంట్రల్ ఉపాధ్యక్షుడు ఓజియార్, పిట్ కార్యదర్శి వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ సద్వినియోగం చేసుకోవాలి

దండేపల్లి(మంచిర్యాల): రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వై.రమేశ్ అన్నారు. దండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డీడీలు తీయడం, ప్రభుత్వం ఇచ్చే రాయితీ, లబ్ధిదారులు చెల్లించే వాటా, తదితర వివరాలపై అవగాహన కల్పించారు.

పరిహారం అందించి ఆదుకోవాలి

నెన్నెల(బెల్లంపల్లి): జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షానికి పంటలు దెబ్బతిన్న రైతులకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండు బానేష్ డిమాండ్ చేశారు. బుధవారం గుండ్లసోమారంలో ఆయన రైతులతో మాట్లాడారు. ఏడేళ్ల నుంచి మామిడి రైతులు నష్టపోతున్నా ఇంత వరకు పరిహారం అందలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పంట నష్టంపై సర్వే జరిపించి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం అందించాలన్నారు. ఆయన వెంట నాయకులు రత్నం బాపు, రాజేశ్, షేక్ అముష్ ఉన్నారు.

వీవోఏలకు కనీస వేతనం చెల్లించాలి



మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఐకేపీ వీవోఏలకు ప్రభుత్వం కనీస వేతనాలు చెల్లించాలని వీవోఏ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ)జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం శ్రీరాంపూర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేది వీవోఏలేనన్నారు. అర్హులైన వారిని సీసీలుగా ప్రమోట్ చేయాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

జిల్లా కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా 23 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దుంపల రంజిత్‌కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లింగంపల్లి వెంకటేశ్, జిల్లా అధ్యక్షుడిగా కుంటాల కుమార్, జిల్లా కార్యదర్శిగా దుర్గం రాములు, కోశాధికారిగా పోట్ట పోశం, జిల్లా ఉపాధ్యక్షులుగా రమాదేవి(కోటపల్లి), జీ.రజిత(కాసిపేట), బుట్ల అనిత(లక్సెట్టిపేట), జిల్లా సహాయ కార్యదర్శులుగా మహేశ్, రజిత, సురేశ్, తదితరులను ఎన్నుకున్నారు.

సేంద్రియ పంటలతో ఆరోగ్యం

- కలెక్టర్ బాదావత్ సంతోష్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: సేంద్రియ పద్ధతిలో పండించిన పంటలతో ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు, మామిడి మేళా సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30, మే 1 తేదీలలో జిల్లా కేంద్రంలోని వైశ్య భవన్‌లో అవగాహన సదస్సు, మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు గోనె శ్యాంసుందర్ రావు, బొడ్డు శంకర్, పెద్దపల్లి తిరుపతి, శ్రీనివాసరావు, అత్తి సరోజ, కంకణాల భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

పంట నష్టం పరిశీలన

దండేపల్లి: ఇటీవల కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ హన్మంతరావు, ఆర్ఐ రంజిత్, ఏఈవో అనిల్ ఉన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం



చిత్తాపూర్‌లో నేలరాలిన మామిడికాయలు

నెన్నెల/భీమిని: జిల్లాలో బుధవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి నెన్నెల, భీమిని, కన్నెపల్లి మండలాల్లో వేలాది ఎకరాల్లో కోతకు వచ్చిన మామిడి కాయలు నేలరాలాయి. అసలే అంతంత మాత్రాన కాసిన మామిడికి మద్దతు ధర లేక మదన పడుతుంటే ఉన్న కాస్త కాయలు నేలమట్టమయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.